## క్లుప్తంగా

### నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఉష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు 9959226287 నంబర్ ద్వారా తమ సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు.

### స్నేహ భావానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు జాకీర్‌షరీఫ్, మహ్మద్ ఫహీం

షాబాద్: స్నేహ భావానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు దోహదపడతాయని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు జాకీర్‌షరీఫ్, మహ్మద్ ఫహీం పేర్కొన్నారు. గురువారం ఎస్ఎస్‌సీ కన్వెన్షన్ హాల్‌లో ఖురేషి అదియాకచుడు (టీఎంఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు, ఆత్మీయత మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లింలకు విరివిగా సహేర్, ఇఫ్తార్ విందులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ఐకమత్యానికి, మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సర్వమత సారం ఒక్కటేనని, మానవులంతా సోదరభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

### కనుల పండువగా బొడ్రాయి ప్రతిష్ఠ



బొడ్రాయి ప్రతిష్ఠలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

షాబాద్: ప్రతి అణువులో దేవుడు ఉండి మంచి మార్గాన్ని చూపిస్తాడని రుద్రారం మాజీ సర్పంచ్ బండ స్వర్ణలత సతీశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుర్రాల విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు హనుమాన్ ఆలయంలో కనుల పండువగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహాల ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమాల్లో భాగంగా కలశస్థాపన, అభిషేకం, హోమం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి హోమం, పుణ్యాహవాచనం, సామూహిక హోమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, నర్సింహులు, సంపత్‌రెడ్డి, కృష్ణ, శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మధు, మాణిక్యం, ఉపేందర్‌రెడ్డి, శివకుమార్, బాలయ్య, రవి, గ్రామస్తులు ఉన్నారు.

### జనజాతరకు తరలిరండి

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: తుక్కుగూడలో శనివారం నిర్వహించే కాంగ్రెస్ జనజాతర బహిరంగసభను విజయవంతం చేయాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. జన జాతర సభతో కాంగ్రెస్ పార్టీ సత్తాను చాటాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో నాయకులు, కార్యకర్తలు పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాలలో విజయఢంకా మోగించాలని కోరారు. తుక్కుగూడలో జరిగే జనజాతర సభలో ఏఐసీసీ మేనిఫెస్టోను ప్రకటించనున్నట్లు ఆయన వెల్లడించారు. సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహ, జగన్, మానయ్య తదితరులు ఉన్నారు.

### ఎరువుల దుకాణంలో తనిఖీలు

తలకొండపల్లి: యాసంగిలో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని ఏఓ రాజు ఎరువుల దుకాణపు యజమానులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. స్టాక్‌నిల్వ తదితర రికార్డులను పరిశీలించారు. యూరియా, డీఏపీ, ఎంఓపీల కొరత లేకుండా అవసరం మేరకు రైతులకు అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పీ ధరలకే ఎరువు బస్తాలు అందజేయాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

# అభివృద్ధి పనులు ముమ్మరం

- 15 వందల ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం
- నిత్య పూజలకు నోచుకోని లక్ష్మీనర్సింహస్వామి
- పనులకు శ్రీకారం చుట్టిన కొందుర్గు గ్రామస్తులు



కొనసాగుతున్న అభివృద్ధి పనులు

కొందుర్గు: కొందుర్గు పెండ్యాల లక్ష్మీనర్సింహా స్వామి దేవాలయం పరిసరాలను శుభ్రం చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 300 ఎకరాలకుపైన భూములున్నా వందల ఏళ్లుగా దేవాలయం దూపదీప నైవేద్యానికి నోచుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో దేవాలయం అభివృద్ధి కోసం చర్యలు ప్రారంభమయ్యాయి. దేవాలయాన్ని నిర్మించి దాదాపు 15 వందల సంవత్సరాలు పూర్తవుతున్నా, విద్యుత్, రోడ్డు, తాగునీరు తదితర వసతులు లేకపోవడంతో పాటు కొందుర్గు గ్రామానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం అడవి ప్రాంతంలో ఈ దేవాలయం ఉండటంతో స్వామివారు నిత్యపూజలకు నోచుకోకుండాపోయారు. అయితే ఈ విషయమై కొందుర్గు గ్రామస్తులు నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలవడంతో ఆయన సానుకూలంగా స్పందించి దేవాలయాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీనిచ్చారు. ఈ మేరకు అంధకారంలో ఉన్న దేవాలయానికి వారం క్రితం విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి విద్యుత్ వెలుగులు తెచ్చారు. గత పదేళ్లక్రితం దాతల సహకారంతో దేవాలయం ఆవరణలో భక్తుల సౌకర్యార్థం వేసిన బోరులో తిరిగి దాతల సహకారంతో మోటారు అమర్చి తాగునీటి వసతిని కల్పించారు. అలాగే ముళ్లపొదల మధ్య ముసుకుపోయిన దేవాలయ ప్రాంగణం చుట్టూ పరిసరాలను శుభ్రం చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

**బయటపడుతున్న విగ్రహాలు**

దేవాలయ ప్రాంగణ పరిసరాలు శుభ్రం చేస్తున్న సమయంలో మట్టి తీస్తుండగా పలు దేవతామూర్తుల విగ్రహాలు బయటపడటం విశేషం. ఇంకా చాలా వరకు చారిత్రాత్మక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతంలో బాదామి చాణుక్యుల కాలంలో పెండ్యాల అనే గ్రామం ఉండేదని, ఔరంగాజేబు పరిపాలనలో పెండ్యాలలోని దేవాలయాన్ని ధ్వంసం చేసి విగ్రహాలను ఖండం చేసి కోనేరులో వేశారని సమాచారం. అదేవిధంగా పెండ్యాల గ్రామాన్ని చిందరవందర చేశారని పూర్వీకులు చెబుతుంటారు.



బయటపడిన దేవాతామూర్తి విగ్రహం

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కేశంపేట: వేసవి కాలం ముగిసే వరకు ప్రతీ అధికారి అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండి నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని కేశంపేట మండల ప్రత్యేక అధికారి రాజారత్నం అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, వాటర్ మ్యాన్‌లతో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజారత్నం మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని పేర్కొన్నారు. నీటి ఎద్దడి ఏర్పడకుండా అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో నిరుపయోగంగా ఉన్న బోర్ మోటార్లను రిపేర్ చేసి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాలను ప్రత్యేక అధికారులు క్రమంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింలు, నాయబ్ తహసీల్దార్ గీత, మండల వ్యవసాయ అధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి రాజారత్నం

### దానగుణాన్ని అలవర్చుకోవాలి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ దాన గుణాన్ని అలవర్చుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన రవికుమార్ వివాహానికి మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మ దంపతులు పుస్తె, మెట్టెలను అందజేశారు. పేదలకు దానం చేయడం ద్వారా పుణ్యం లభిస్తుందని పేర్కొన్నారు. నిరుపేదలను ఆదుకునేందుకు పెళ్లి కానుకగా పుస్తె, మెట్టెలను అందజేస్తున్నట్లు తెలిపారు.

### 6న మండల సమావేశం

షాబాద్: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు షాబాద్ ఎంపీడీఓ అపర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగనుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు, ఆయా శాఖల డివిజన్ స్థాయి అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

### ఆలయాల అభివృద్ధికి కృషి



విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సావాలకు తనవంతు సాయంగా లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, నర్సింహులు, సతీశ్, అజయ్ తదితరులు ఉన్నారు.

# తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి



మాట్లాడుతున్న సంధ్య, వెంకటేశ్వర్‌రెడ్డి

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీడీఓ సంధ్య సూచించారు. గురువారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో పాటు వాటర్‌మెన్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి నీటి సమస్యలు రాకుండా ప్రతి రోజు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు వాటర్‌మెన్‌లకు అనుసంధానంగా ఉంటూ తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. మండుతున్న ఎండల దృష్ట్యా నీటి కొరత ఏర్పడే సమస్య ఏమైనా ఉంటే వెంటనే తెలియజేయాలని, సమస్యలు పరిష్కరించేందుకు అందరం కృషి చేసుకుందామన్నారు. పైపులైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేయించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య రానివ్వొద్దు

ఎంపీడీఓ వెంకయ్య

చేవెళ్ల: గ్రామాల్లో నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల ప్రత్యేకాధికారులకు ఎంపీడీఓ వెంకయ్య సూచించారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారులు, గ్రామ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నీటి సమస్యలు రాకుండా అధికారులు అందుబాటులో ఉండి తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండలతో భూగర్భజలాలు తగ్గుతుండడంతో నీటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ముందుగానే అలాంటి గ్రామాలను గుర్తించి అక్కడ ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలని చెప్పారు. గ్రామ కార్యదర్శులతో కలిసి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడూ గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు చెల్లించేలా ప్రజలకు తెలియజేసి వందశాతం వసూలు చేపట్టాలన్నారు. ఈ వారంలో పూర్తి చేయాల్సిన పనులు, గతవారంలో పూర్తి చేసిన పనులపై ఈ సమీక్షలో చర్చించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

# ఓటు హక్కుపై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో కమిషనర్

మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్: ప్రతీ ఓటర్ ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధి కొహెడలోని నారాయణ ఐఏఎస్ అకాడమీ అండ్ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రత్యేక ఓటరు నమోదు, ఎన్నికల భాగస్వామ్యం అవేర్‌నెస్ క్యాంపెయిన్‌ను నిర్వహించారు. నూతనంగా ఓటరుగా నమోదు చేసుకున్న యువత తమ ఓటుహక్కును తప్పక వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని.. ఓటు విలువ తెలుసుకొని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. గ్రామాల్లో అధికారులు ఓటుహక్కుపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, మున్సిపల్ ఈఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. రంజాన్, ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ ఏర్పాట్లపై గురువారం ఎమ్మెల్యే మైనార్టీ నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందన్నారు. నెలరోజుల పాటు ముస్లింలు కఠోరమైన ఉపవాస దీక్షలు చేసి అల్లాను ప్రసన్నం చేసుకుంటారని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన జరుపుకోబోయే రంజాన్ సందర్భంగా జమీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు వేలాది మంది తరలివస్తుంటారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ప్రార్థనా స్థలాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. మున్సిపాలిటీ తరఫున ప్రార్థనా స్థలాల వద్ద పారిశుద్ధ్యం, మంచి నీరు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, సదర్ ఖాజీ సయ్యద్ ముక్తధీర్ అలీ, మన్సూర్ అలీఖాన్, సయ్యద్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీ నేతలతో ఎమ్మెల్యే శంకర్

# ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



బీజేపీ నాయకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పలు పార్టీల నాయకులు అన్నారు. మండలంలోని అల్లవాడ అనుబంధ గ్రామమైన జాలగూడ గ్రామంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐలకు చెందిన నాయకులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం వారికి గ్రామ ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి, ఆలయానికి సంబంధించిన ఫొటోలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, సీపీఐ నాయకులు కె.రామస్వామి, మక్బూల్, యాదగిరి, వడ్ల మంజుల, కాంగ్రెస్ నాయకులు పామెన భీంభరత్, శ్రీనివాస్‌గౌడ్, పాండు, డీవీఆర్, ఆగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శైలజ, సమత, కృష్ణారెడ్డి, జంగయ్య, తిరుపత్తిరెడ్డి తదితరులు ఉన్నారు. గ్రామ నాయకులు కృష్ణారెడ్డి, రాజు, అమరేందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు ఉన్నారు.

# కష్టపడి చదివితే మంచి భవిష్యత్

కేశంపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని, కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ అన్నారు. ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైంది. అందులో భాగంగా గురువారం నిర్భన్ అర్గనైజేషన్ సభ్యుల సహకారంతో విద్యార్థులకు కెరీయర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పదో తరగతి తర్వాత విద్యార్థులకు చాలా అవకాశాలు ఉంటాయన్నారు. కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధిస్తే ఉచిత విద్యా అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాససాగర్, కృష్ణయ్య, అబ్దుల్‌బారీ, సాయి ప్రసాద్, సుజాత, శిరీష, నిర్భన్ ఆర్గనైజేషన్ సభ్యులు నగేంద్రపోలిశెట్టి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖర్

# లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతాం

బీజేపీ శంకర్‌పల్లి మున్సిపల్ ఇన్‌చార్జిగా వాసుదేవ్‌కన్న




వాసుదేవ్‌కన్నకు కండువా కప్పుతున్న నర్సింహారెడ్డి, తదితరులు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఇన్‌చార్జిల నియామకంలో భాగంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీ ఇన్‌చార్జిగా వాసుదేవ్‌కన్నను నియమించారు. ఈ మేరకు గురువారం బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి వాసుదేవ్‌కన్నకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవ్‌కన్న విలేకరులతో మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన ఈ పదవీ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలో పార్టీని బలోపేతం చేసి ఈ లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు సాధించేందుకు పాటుపడుతానన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా పార్టీ బలోపేతం అవుతుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి మోదీకి కానుకగా అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తన ఎన్నికు సహకరించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, నాయకులు అంజన్ కుమార్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

మొయినాబాద్: విద్యార్థులు కొత్త ఆలోచనలు, నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సిద్వత ఇంటలెక్చువల్ ఫౌండేషన్ సీఈఓ శ్రవణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో కేంద్ర విద్యాశాఖ(ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త విషయాలను బయటకు తేవాలన్నారు. విద్యార్థులు కొత్త ఆలోచనలకు పదునుపెట్టి, నూతన ఆవిష్కరణలు చేస్తూ వాటిపై పేటెంట్ రైట్స్ ఎలా తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐపీఆర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సీఈఓ శ్రవణ్‌కుమార్

### గెలుపే లక్ష్యంగా పనిచేయండి

మంచాల: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. గురువారం మంచాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వచ్చే ఐదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. శుక్రవారం మంచాల మండల కార్యాలయంలో నిర్వహించే రైతు సత్యాగ్రహ నిరసన దీక్ష, బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భాషయ్య, జంగయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, భిక్షపతి, లక్ష్మారెడ్డి, ఐలయ్య, రవీందర్‌రెడ్డి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు జయశ్రీ పాల్గొన్నారు.